క్లుప్తంగా

రేపటి నుంచి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

సత్తెనపల్లి: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని అమరావతి బస్ స్టాప్ సెంటర్‌లో గల డాక్టర్ వైఎస్ఆర్ శాఖ గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ కె.వాణి శనివారం తెలిపారు. శిబిరంలో కథలు చెప్పడం, చదివించడం, డ్రాయింగ్, జీకేతో పాటు వివిధ అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి వేడుకలు



సత్తెనపల్లి: మండలంలోని పెద మక్కెనలో గల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో శనివారం మాస శివరాత్రి పర్వదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలతో అవస్థలు



పెదకూరపాడు: స్థానిక బీసీ(పాముల) కాలనీకి వెళ్లే రహదారికి ఇరువైపులా సగ భాగాన్ని వ్యాపారులు కొనుగోలు చేసిన ఇనుము, ప్లాస్టిక్ వ్యర్థాలతో నింపేశారు. దీనివల్ల వాహనాలు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. కాలనీ ప్రజలు కూడా అవస్థలు పడుతున్నారు. ప్రధాన కాలచక్ర రోడ్డుకు అనుకొని ఉండటంతో ఈ రోడ్డులో బీసీ కాలనీ వాసులతో పాటు, ఎస్సీ కాలనీవాసులు తిరుగుతుంటారు.శ్మశానికి వెళ్లే రహదారితో పాటు నిత్యం వ్యవసాయ పనుల కోసం రైతులు, కూలీలు వాహనాలలో తిరుగుతుంటారు. అధికారులు స్పందించి వ్యాపారులకు నోటీసులు ఇచ్చి, వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, కాలనీవాసులు కోరుతున్నారు.

రేపు ప్రముఖ హార్మోనిస్టు షేక్ ఖుదావన్‌కు నివాళి

క్రోసూరు: స్థానిక జెడ్పీ హైస్కూలులోని కళాక్షేత్రంలో సోమవారం ప్రముఖ హార్మోనిస్టు షేక్ ఖుదావన్ 24వ వర్ధంతి సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాబంధు బొబ్బిళ్లపాటి గోపాలకృష్ణసాయి శనివారం తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు సభ, 6.30 గంటలకు ఆపాత మధురాలు ఆర్కెస్ట్రా, 7.30 గంటలకు నర్తనశాల హరికథ, 9 గంటలకు నాన్నా-నేనొచ్చేస్తా నాటిక, 10 గంటలకు సంఘ సంస్కర్త కాళ్లకూరి నారాయణరావు రచించిన భక్త చింతామణి పూర్తి నాటకం ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాభిమానులు, ఖుదావన్ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వైభవంగా మహంకాళి అమ్మవారి తిరునాళ్ల



మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదలలో శ్రీ మహంకాళి అమ్మవారి 45వ వార్షిక తిరునాళ్ల శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమపూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయం ముందు చలువ పందిళ్లు ఏర్పాటు చేసి మజ్జిగ, మంచినీరు అందించారు. సత్తెనపల్లికి చెందిన అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోనూ భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు నిర్మించిన విద్యుత్ ప్రభపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అన్ని ట్రెజరీ కార్యాలయాలు కంప్యూటరీకరణ

మాచర్ల: పల్నాడు జిల్లాలోని తొమ్మిది ఉప ఖజానా కార్యాలయాలను కంప్యూటరీకరణ చేసి పెన్షన్‌దారులకు, వివిధ ప్రభుత్వ శాఖల వారికి ఉత్తమ సేవలందించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు పల్నాడు జిల్లా ఖజానా అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం పట్టణంలోని ఉప ఖజానా కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించి ఆడిట్ నిర్వహించారు. అనంతరం స్థానిక ఉప ఖజానాధికారి కేతావత్ రామానాయక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. పింఛన్ల పంపిణీలో సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అన్ని సేవలను కంప్యూటరీకరణ చేసి ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు చెప్పారు. మాచర్ల పట్టణంలోని నూతన ఉపఖజానా కార్యాలయానికి ఐదు సెంట్ల భూమిని పెన్షనర్స్ అసోసియేషన్ భవనం ఎదురుగా కేటాయించినట్లు తెలియజేశారు.

పల్లెల్లో దోమల దండయాత్ర

- కానరాని నివారణ చర్యలు
- అటకెక్కిన ఫాగింగ్ మిషన్లు
- ప్రబలుతున్న వ్యాధులు
- ఆసుపత్రి పాలవుతున్న ప్రజలు
- ఖాళీ స్థలాలు, అపరిశుభ్రతే దోమలకు కారణాలు



వ్యర్థాలతో నిండిపోయిన పేరమ్మ వాగు

పెదకూరపాడు: ఫాగింగ్ యంత్రాలు ఉన్నా వాడరు... మరమ్మతులకు గురైతే పట్టించుకోరు... ఖాళీ స్థలాలు చిట్టడవుల్లా దర్శనం ఇస్తున్నా యజమానులకు నోటీసులు ఇవ్వడం తప్పా చర్యలు శూన్యం. ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రం చేయాల్సి ఉన్నా....అదీ సరిగా జరగదు. ఇదీ పల్నాడు జిల్లాలోని పల్లెల్లో పరిస్థితి. ఏటా ఫాగింగ్ ,స్ప్రేయింగ్‌తో దోమల నివారణ మందులు కొనుగోలు, యంత్రాలకు డీజిల్ తదితర ఖర్చులకు రూ.లక్షలు వెచ్చిస్తున్నట్లు చూపిస్తున్నా... దోమల కట్టడి చర్యలు కాగితాలకే పరిమితం అవుతోంది.

ప్రజలు ఉక్కిరిబిక్కిరి

పల్నాడు వాసులపై దోమలు దండయాత్ర చేస్తున్నా కట్టడికి కనీస చర్యలు లేవు. ఓ వైపు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర పేరిట పారిశుద్ధ్య కార్యక్రమాలు చేస్తున్నా స్వచ్ఛత కరువైంది. దోమల ఉధృతికి సాయంత్రమైతే ఆరుబయటే కాదు... ఇళ్లల్లోనూ ఉండలేని పరిస్థితి నెలకొంది. ఓవైపు ఉక్కపోత...మరో వైపు దోమల బెడదతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వ్యాధులు ప్రబలి ప్రజలు ఆసుపత్రి పాలవుతున్నారు.

ఖాళీ స్థలాలు దోమలకు నిలయాలు

ఖాళీ స్థలాలు చిట్టడవుల్లా దర్శనం ఇస్తున్నా వాటి యజమానులకు పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. చిట్టడవులా ఉన్న ఖాళీ స్థలాలు దోమలకు నిలయంగా మారుతున్నాయి. పలు పల్లెల్లో మురుగు పారుదల కూడా అస్తవ్యస్తంగా ఉండి దోమల ఉధృతికి కారకమవుతున్నాయి.

కుటుంబంపై నెలవారీ భారం

దోమల బెడద వల్ల ఓ సాధారణ కుటుంబంపై నెలకు కనీసం రూ.1000 నుంచి రూ.1500 వరకు అదనపు భారం పడుతోంది. దోమల నియంత్రణకు లిక్విడ్‌లకు రూ.300, బ్యాట్‌కు రూ.350 నుంచి రూ.800 ఖర్చవుతోంది. అగరొత్తులు, కాయిల్స్ చాలక దోమతెరకు మరో రూ.600 వరకు వ్యయం చేస్తున్నారు. అనారోగ్యం బారిన పడితే ఆసుపత్రి ఖర్చులు అదనం.

పనిచేయని ఫాగింగ్ మిషన్లు

పల్నాడు జిల్లాలో మొత్తం 28 మండలాలు 432 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. వాటిలో చాలా గ్రామాలకు ఫాగింగ్ మిషన్లు లేవు. ఉన్న వాటిలో 70శాతం మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడే లేరు.దీంతో గ్రామాల్లో దోమల నివారణ చర్యలు తూతూమంత్రంగానే సాగుతోంది. పెదకూరపాడు మండలంలో 20 గ్రామ పంచాయితీలున్నాయి. వీటిల్లో 15 ఫాగింగ్ యంత్రాలు మాత్రమే ఉన్నాయి. వాటిలో ఒక్కటి కూడా పని చేయడం లేదు. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో మిషన్లు అటకెక్కించారు. రూ. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసినా వాటి పర్యవేక్షణ మాత్రం శూన్యం.



పెదకూరపాడు పంచాయతీలో అటకెక్కిన ఫాగింగ్ మిషన్

నివారణ చర్యలు తీసుకోవాలి



దోమల ఉధృతి గ్రామాల్లో అధికంగా ఉంది. ఫాగింగ్‌తో పాటు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. సామాన్యులపై దోమల బెడదతో ఆర్థిక భారం పడుతోంది. పగలంతా పని చేసి రాత్రి దోమల దాడితో నిద్ర ఉండటం లేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

–మునగోటి శ్రీనివాసరావు, సీపీఐ నేత

ఫాగింగ్ మిషన్లను బాగు చేయిస్తాం

ఫాగింగ్ మిషన్లు మరమ్మతులకు గురైయ్యాయి. వాటిని బాగు చేయిస్తాం. ఎప్పటికప్పుడు కాలువలను కూడా శుభ్రం చేస్తాం. పారిశుద్ధ్య కార్మికులు రోజూ గ్రామాల్లో చెత్తను సేకరిస్తున్నారు. దోమల బెడద లేకుండ చర్యలు తీసుకుంటాం.

–సోమయాజులు, ఎంపీడీవో

ఉగ్రవాదంపై ఐక్యంగా పోరాడాలి



కొవ్వొత్తుల ర్యాలీలో సీపీఎం నాయకులు, స్థానికులు

సత్తెనపల్లి: దేశ సమగ్రత, సమైక్యత కోసం మతాలకు అతీతంగా భారతీయులందరూ కలిసి ఉగ్రవాదంపై పోరాడాలని సీపీఎం సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ పిలుపునిచ్చారు. పహల్గాం ఉగ్రవాద ఘటనను నిరసిస్తూ సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో శనివారం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పెండ్యాల మహేష్ మాట్లాడుతూ ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దాన్ని భారతీయులంతా ఐక్యంగా ఎదుర్కోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గత వారం రోజుల నుంచి పాకిస్తాన్‌స్పైన్యాధికారి ఉగ్రవాదులను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నా వాటిని పసిగట్టడంలో కేంద్ర బలగాలు, ప్రభుత్వం ఎందుకు వైఫల్యం చెందారో దేశ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.యాత్రికులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని విమర్శించారు. దేశ ప్రజలను రక్షించడానికి కేంద్ర బలగాలను ఉపయోగించుకోలేని బీజేపీ ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను అణిచివేయడానికి మాత్రం ఉపయోగిస్తుంటుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు ఎం. నరసింహారావు, జై భగత్, బి. రామారావు, డి. మేరమ్మ, గ్రామస్తులు ఎం. శివరావు, అనూష, సుజాత, అమూల్య, లక్ష్మి, తాతారావు, వెంకటపతి, సౌజన్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగిపై దాడి దుర్మార్గం

- సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్
- సత్తెనపల్లిలో నల్ల బ్యాడ్జీలతో గ్రామ రెవెన్యూ సహాయకుల నిరసన



నిరసనలో గ్రామ రెవెన్యూ సహాయకులు, సీఐటీయూ నాయకులు

సత్తెనపల్లి: విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి మీద దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్ ఖండించారు. అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం గాదెల గ్రామ వీఆర్ఏ పెంచలయ్యపై శుక్రవారం జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకులు నల్ల బ్యాడ్జీలతో సత్తెనపల్లిలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ తక్షణమే దాడి చేసిన వ్యక్తి మీద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ రెవెన్యూ సహాయకుల పల్నాడు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ వీఆర్ఏల మీద ఇటీవల దాడులు పెరిగాయని, వారికి రక్షణ కల్పించాలని కోరారు. పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం గౌరవాధ్యక్షురాలు మల్లేశ్వరి మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకుల అసోసియేషన్ సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి ముస్తఫా, బెల్లంకొండ మండలం అధ్యక్షుడు సుందరరావు, కార్యదర్శి ఆంజనేయులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



సబ్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఈ

నకరికల్లు: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ పల్నాడు జిల్లా ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని చల్లగుండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం ఆయన తనిఖీలు చేపట్టారు. సబ్‌స్టేషన్ ఆపరేటింగ్ సిస్టమ్, ట్రాన్స్‌ఫార్మర్‌లు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా రెండవ శనివారం విద్యుత్ లైన్‌లకు మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. విద్యుత్ బకాయిలను నూరుశాతం వసూలు చేయాలని చెప్పారు. నూతన సర్వీసుల కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే మంజూరు చేయాలని ఆదేశించారు. అదనపులోడును 50శాతం రాయితీతో క్రమబద్ధీకరించేందుకు ఆదేశాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు జూన్ 30లోగా వినియోగదారులకు అవగాహన కల్పించి క్రమబద్ధీకరించాలని తెలిపారు. గృహ, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఏర్పడే ఇబ్బందులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని చెప్పారు. వినియోగదారులకు, రైతులకు ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పని చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీఈఈ బి.వెంకటేశ్వరరెడ్డి, నకరికల్లు ఏఈ షేక్ గౌస్, లైన్‌మెన్‌లు ఉన్నారు.

జాస్పర్ నాయక్‌కు గిన్నిస్ బుక్‌లో స్థానం



అమరావతి: మండలంలోని పెదమద్దూరుకు చెందిన తేజోవత్ అడోన్ జాస్పర్ నాయక్‌కు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఆయన విజయవాడలోని హలెల్ మ్యూజిక్ స్కూల్‌లో దండంగి అగస్టీన్ వద్ద కీబోర్డు ప్లేయింగ్‌లో మంచి పట్టు సాధించారు. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్ 1న ప్రపంచవ్యాప్తంగా 18దేశాలకు చెందిన 3,000 మంది సంగీత ప్రముఖులకు సరిగమలు విభాగంలో నిర్వహించిన పోటీలో ఆంధ్రప్రదేశ్ నుంచి జాస్పర్ నాయక్‌ను గుర్తించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించారు. ఈ నేపథ్యంలో ఈనెల 25న శుక్రవారం విజయవాడలోని మెట్రోపాలిటిన్ చర్చిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నాయక్‌కు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను నిర్వాహకులు అందజేశారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి

ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు



పెదకూరపాడులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ



కంటెపూడిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్‌కుమార్

పెదకూరపాడు : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెదకూరపాడు ఎక్సైజ్ శాఖ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కాకతీయ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు డ్రగ్స్, మద్యం, సారా వలన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. కుటుంబాలు ఆర్థికంగా నష్టపోటమే కాకుండా అనారోగ్యం పాలవుతారని తెలిపారు. అనంతరం ఎస్ఐ పేరు సాహెబ్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీనివాసరావు, రవికుమార్, హనుమంతు, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ బాబు, కరీం పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో..

మత్తు పదార్థాల వల్ల శరీరంలోని అన్ని వ్యవస్థలు దెబ్బ తింటాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సీఐ పి. విజయ్ కుమార్ తెలిపారు. మద్యపానం, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై కంటెపూడి సమీపంలోని నలంద ఇంజనీరింగ్ కళాశాలలోని ఫార్మసీ విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులంతా మద్యానికి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు చెప్పే మంచి విషయాలను పాటించాలని తెలిపారు. జీవితంలో మంచి లక్ష్యాలను ఏర్పరచుకొని విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. అనంతరం మద్యపానానికి, డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో ఎస్ఐ కె.నాగలక్ష్మి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ స్టేషన్ సిబ్బంది నరసింహారావు, దాసు, ఖాజా, హనుమ, ఆనంద్, నలంద కళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బెల్లంకొండలో..

యువత మత్తుకు బానిసలై జీవితాలను పాడు చేసుకోవద్దని క్రోసూరు ఎక్సైజ్ సీఐ తులసి తెలిపారు. శనివారం మండలంలోని వెంకటాయపాలెంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. యువత మద్యానికి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామంలో నాటు సారా విక్రయాలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించామని తెలిపారు. నాటు సారా, డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలను గ్రామస్తులకు వివరించారు. నాటు సారా విక్రయించే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



వెంకటాయపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ తులసి

ఘనంగా లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చనలో స్వామి

నకరికల్లు: నర్సింగపాడులోని అయ్యప్పస్వామి సహిత గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి వేడుకను శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. మాస శివరాత్రి పురస్కరించుకొని స్వామికి లక్ష పుష్పార్చన విశేషంగా నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. పొంగళ్లు పొంగించి స్వామికి మొక్కులు చెల్లించారు.

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో...

నర్సింగపాడులోని శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విశేష పూజాధికాలు నిర్వహించారు. స్వామివారిని, అమ్మవారిని విశేషంగా అలంకరించారు. విశేష అలంకరణలో ఉన్న స్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

వైభవంగా పోలేరమ్మ జాతర ప్రారంభం



బెల్లంకొండ: మండలంలోని నాగిరెడ్డిపాలెంలో శనివారం పోలేరమ్మ తల్లి జాతర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శనివారం గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా చెరువు కట్ట సమీపంలో గల వాటర్ ట్యాంకు ఆవరణలో వన భోజనాలు చేశారు. అనంతరం గ్రామంలోని మదర్ సాహెబ్ దేవుడికి చుట్టలు, మద్దిరావమ్మ తల్లికి రొట్టెలను సమర్పించారు. పోలేరమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారికి మొక్కుబడులు సమర్పించారు. ఆదివారం పోలేరమ్మ, గంగమ్మ తల్లికి ప్రభలను కట్టి కుంకుమ బండ్లు ఊరేగింపు ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలను ఎత్తుకొని అమ్మవారికి సమర్పిస్తారని చెప్పారు.

వైభవంగా నారసింహుడికి పూజలు



ప్రత్యేక అలంకరణలో వజ్ర లక్ష్మీ నారసింహుడు

బెల్లంకొండ: మండలంలోని పులిచింతల ముంపు గ్రామమైన కేతవరంలో శనివారం వజ్ర లక్ష్మీ నారసింహస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు జరిగి 16 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండ దిగువన గల ఆలయంలో వెంకటాద్రి నాయుడు పరిపాలనలో కోనేరులో లభ్యమైన చెంచులక్ష్మీ సమేత పంచలోహ నరసింహస్వామికి కృష్ణానది జలాలతో పంచామృత అభిషేకాలను నిర్వహించారు. భక్తులు స్వామికి పొంగళ్లు చేసి నైవేద్యాలను సమర్పించారు. ఆలయ అర్చకులు దివి ప్రసన్నకుమార ఆచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో అవుదూరి వెంకటేశ్వరరెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నరసింహారెడ్డి, ఈమని వెంకటరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగెలను క్రమబద్ధీకరించిన సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్



అచ్చంపేట: భీకర గాలులకు పెదపాలెం గ్రామానికి చెందిన నల్లమోతు పాండురంగ కుమారస్వామి పొలంలో ఈనెల 16న వ్యవసాయ విద్యుత్ వైరు తెగి కిందపడి ప్రమాదకరంగా మారింది. సాక్షి జోన్ పేజీలో 'తెగిన విద్యుత్ వైరు.. పట్టించుకోని సిబ్బంది' శీర్షికతో ప్రచురితమైన వార్తకు విద్యుత్ అధికారులు స్పందించారు. శనివారం యుద్ధప్రాతిపదికన వైరును క్రమబద్ధీకరించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఏఈ శివకోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ తీగె తెగిన విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు. సాక్షిలో వచ్చిన వార్తకు స్పందించి సిబ్బందిని పంపి తెగిన తీగతో పాటు మరికొన్ని విద్యుత్ కనక్షన్లను, వంగిపోయిన విద్యుత్ స్తంభాలను కూడా క్రమబద్ధీకరించినట్లు చెప్పారు. విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తేవాలని ఆయన రైతులకు సూచించారు.

నేడు గిరిజన ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

మాచర్ల: పల్నాడు జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలలో నివాసముండే గిరిజన, చెంచుల సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రత్యేకంగా మాచర్ల నియోజక వర్గంలోని పట్టణంలో సాగర్ రోడ్డులోని వైభవ్ ఫంక్షన్ హాలులో గిరిజనుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర గిరిజన సంఘ నాయకులు మండ్లి పెద్ద మల్లు స్వామి, ఉమ్మడి జిల్లా గిరిజన సంఘ నాయకులు నూన్సావత్ రంగానాయక్ తెలిపారు. శనివారం విలేకరులతో గిరిజన కార్యాలయంలో మాట్లాడారు. దాదాపుగా పల్నాడు జిల్లాలో అనేక తండాల్లో, చెంచు కాలనీల్లో సమస్యలున్నాయని, ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీటి పై ఆత్మీయ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ కమిటీ సభ్యులు వడితె శంకర్‌నాయక్ హాజరవుతారని చెప్పారు. విలేకరుల సమావేశంలో గిరిజన నాయకులు బాలాజీ నాయక్, సూర్యానాయక్, గంగయ్య పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు



గాయపడిన నాగేశ్వరరావు, సుధాకర్

పెదకూరపాడు: మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ అదుపుతప్పి ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని అబ్బరాజుపాలెంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. క్రోసూరు మండలం హసనాబాద్ గ్రామానికి చెందిన మల్లెల నాగేశ్వరరావు, సుధాకర్ రెండు ద్విచక్ర వాహనాలపై కృష్ణాజిల్లా మైలవరంలో జరిగిన వివాహానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పెదకూరపాడు మండలం అబ్బరాజుపాలెం గ్రామ సమీపంలో చెరువు కట్ట వద్ద వాహనాలు అదుపుతప్పి రెండూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుధాకర్, నాగేశ్వరరావులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం మేరకు 10 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.